# కన్నీటికి విలువెంత?

ఉదయం పన్నెండున్నర సమయం.

సరోజినిదేవి మెటర్నిటీ హోమ్‌లో డాక్టరు సరోజినీదేవి, ఎమ్. బి. బి. ఎస్. M. D. గైని కాలజీ స్పెషలిస్ట్ ఉదయంనించి పేషంట్లతో ఉక్కిరి బిక్కిరి అయి కాస్త ఊపిరి పీల్చుకొనే సమయం! ఆవిడ నర్సు చాలా బిజీగా అ పూట లెక్కలు, వసూళ్ళు సరిచూసుకుంటూ తలక్రిందు లయ్యే సమయం!

ఆలాంటి సమయంలో డాక్టరు సరోజినీదేవి తీరికని, నర్సు బిజీని చెదరగొడ్తూ ఆమెగారి కారు డ్రైవరు ఆవిడని విసిగిస్తున్నాడు పావుగంట నించి. పదిహేను నిమిషాలనించి డ్రైవరు రంగయ్య చెప్పిందే చెపుతూ, అడిగిందే అడుగుతూ ప్రార్థించిందే ప్రార్థిస్తూ, ఆవిడ సహనాన్ని పరీక్షిస్తున్నాడు. అయితే సరోజినీదేవి డాక్టరు! అందులో ప్రైవేటు ప్రాక్టీసు కావడంవల్ల అనేక సమయాల్లో ఆవిడ చిరాకుని, కోపాన్ని పైకి కనిపించకుండా వుంచగలగడంలో చాలా ప్రాక్టీసు వుంది కనక మొహానికి నవ్వు పులుముకొనే మృదువుగానే రంగయ్య అభ్యర్థనని తిరస్కరిస్తోంది.

ఇక్కడ నాకెలా వీలవుతుంది చెప్పు రంగయ్యా? నీవే చూస్తుంటావు పెద్దపెద్ద వాళ్ళందరూ వస్తూంటారు. ఎప్పుడూ ఒక రూముఅన్నా ఖాళీగా వుండగా చూశావా? అంటూంది ఆవిడ ఆ అభ్యంతరంతో నయినా వదిలించుకోవాలని.

"అమ్మమ్మ. అలా అనకండమ్మగారూ. దానికి రూములవీ ఎందుకమ్మా ఏ వరండాలో పక్కేసినా పడుంటుంది. మీ చెయ్యి సల్లటిసెయ్యి. ఏదో మీ దయవల్ల ఈసారన్నా బిడ్డ దక్కుతాదని ఆశ! అంతకంటె ఏం

లేదమ్మగారూ !" రంగయ్య జీడులా పట్టుకుని అప్పటికి అరడజనుసార్లు పల్లించిన మాటే మరోసారి అన్నాడు.

"ఏమిటో నీ పిచ్చి, నీకెందుకు భయం. పెద్దాసుపత్రిలో చేర్పించు. నేను అక్కడి డాక్టర్లకి జాగ్రత్తగా చూడమని ఫోనుచేసి చెపుతా. చూడు ఇక్కడి కందరూ పెద్దపెద్దవాళ్ళు వస్తూంటారు.... ఇక్కడయితే చాలా ఖర్చవుతుంది మరి....నీ పెళ్ళాన్ని ఎక్కడుంచడానికి అవుతుంది చెప్పు ..."

రంగయ్య దీనంగా చూశాడు. "మీ దయ. మీరలా అనేస్తే నేనేం చెప్పగలను.... మూడుసార్లు ముగ్గురు బిడ్డలు.- పుట్టకుండానే ఇద్దరు. పుట్టి ఒకడు పోయారు. ఈసారన్నా బిడ్డ దక్కకపోతే దానికి పిచ్చెక్కిపోతుం దమ్మగారూ ...."

"అబ్బబ్బ. నీగోల నీదేకాని నా మాట వినిపించుకోవుగదా. నీ పెళ్ళా నికేం ఫరవాలేదు. నిన్న చూశాగా. అంతా సవ్యంగానే వుంది. మరో ఇరవై రోజుల్లో కాన్పు రావచ్చు. నెప్పులురాగానే ఆస్పత్రికి తీసికెళ్ళు. నేను వెంటనేఫోనుచేస్తా వాళ్ళకి. అక్కడ బాగానే చూస్తారు. బిడ్డచనిపోతే దానికి వాళ్ళేంచేయగలరు చెప్పు! అనవసరంగా నీభయంగాని.... ఇక్కడుంటే నేనుమాత్రం బిడ్డని బ్రతికించగలనా ?...."

రంగయ్య ఇంకేం చెప్పనన్నట్లు దిగులుగా చూశాడు. నిరుత్సా హంగా.... "ఏదో మీకాడ పనిచేసే ఓడినికదా అని. మీరు దయుంచుతారని అడిగా నమ్మగారూ లేకపోతే మాలాంటివాళ్ళకి ఈ నర్సింగు హోము దరి దాపులకి వచ్చేఅర్హతలేదని నాకు తెలియదా ! ఏదో మీరయితే నాకు భరోసా. ధైర్యం అన్పిప్పి అడిగా నమ్మగారూ.... ....సరే మా రాతెట్లా వుంటే అట్లాగే అవుతుంపెలెండి" అన్నాడు బాధగా.

అదే సమయంలో నిగనిగలాడుతున్న ఓ పెద్ద నల్లనికారు వచ్చి మెట ర్నిటీ హోము పోర్టికోలోఆగింది. ఆ కారుని దానిలోంచి దిగుతున్న ఖరీద యిన మనుష్యులని చూడగానే "ఆ....ఆ....సరేసరే తర్వాత చూద్దాంలే.... ఇంకా టైముందిగా ఆ వేళకి ఖాళీవుంటే డెలివరీ ఇక్కడే చేయిస్తాలే

....ఇంత వెళ్ళు ఎవరో వచ్చారు" అంటూ హడావుడి పడింది సరోజినీదేవి.

ఆ కాస్త మాటకే రంగయ్యమొహం కళకళలాడింది. "దేవుడు మిమ్మల్ని సల్లగా సూస్తాడమ్మగారూ ...." అంటూ కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

సూటు బూటుతోవున్న ఏభై ధాటిన ఆయన అయన వెనకాల పట్టు చీరెతో నలభై దాటిన స్త్రీ, ఆవిడ ప్రక్కన నెలలునిండి అతి సుకుమారంగా కన్పిస్తున్న ఓ యువతిని గదిలోంచే చూసింది సరోజినీదేవి. వచ్చినవాళ్ళ అంతస్థుల్ని— వాళ్ళ కార్లనీ, ఖరీదయిన బట్టల్నిచూసి నిర్ణయించడం సరోజినీదేవికి అలవాటయిన పని— గుమ్మంలో వాళ్లనిచూస్తూనే రోగం తెల్సుకోకుండానే వాళ్ళబిల్లుల్ని మనసులో నిర్ణయించుకోడం సరోజినీదేవి హాబీ! ఇప్పుడు ఖరీదయిన ఇంపాలాకారు రెపరెపలాడే సిల్కుచీరలు చూస్తూనే ఎన్నోపచ్చనోట్లు ఆమె మనసులో కదలాడాయి.

మామూలు అలవాటుప్రకారం ముందుగదిలో నర్సు వచ్చిన పేషెంట్లని రిసీవ్‌చేసుకొని ఎందుకొచ్చారో, పేరేమిటో, వూరేమిటో వివరాలు అడిగి, ముందుగా అప్పాయింట్‌మెంటు అది ఉందోలేదో మొదలయిన లాంఛనాలన్నీ పూర్తిచేసిగాని డాక్టరుదగ్గరకి తీసికెళ్ళదు. అలా తీసికెళ్లిన పేషెంట్లని డాక్టరు అతి బిజీగా ఏదోరాస్తూ మధ్యలో వచ్చిన వారికేసి చూడకుండానే చేయి వూపుతుంది కూర్చోమని. ఆ తరువాత ఆ రాసే బ్రహ్మరాత ఆపి తలెత్తి అతి మనోహరంగా ఓ నవ్వునవ్వి పేషెంట్లని సమ్మోహితులని చేస్తుంది. ఆ తర్వాత అసలు కార్యక్రమానికి నాందీగా, "వాట్ కెనయ్‌డూ ఫర్ యు" అంటూ అతి వినయంగా, అతి శ్రద్ధచూపుతూ వారికోసమే తనక్కడ ఎదురుచూస్తూ కూర్చున్నట్లు అడుగుతుంది.

ఆ రోజూ అదే తంతు జరిగింది. ఆ వచ్చిన పెద్దమనిషి గొంతు సవరించుకొన్నాడు.... "ఈ అమ్మాయ్, మా అమ్మాయి.... తొమ్మిదో నెల వచ్చింది.... ఓ సారి చూపించి రూము కాస్త ముందుగా బుక్ చేసుకుందాం అని...."

"మంచిపని చేశారు. మా నర్సింగ్ హోంలో కనీసం పదిహేను రోజుల ముందన్నా రూము రిజర్వ్ చేసుకోకపోతే ఖాళీవుండదు...." అంది సందు దొరగ్గానే తనెంత బిజీ డాక్టరో వివరిస్తూ.

"ఆ....ఆ.... అలా అనే మేమూ విన్నాం. అందుకేవచ్చాం. మీరో సారి అమ్మాయిని చూసి ఏ తేదీల్లో పురుడురావచ్చో చెబితే రూము రిజర్వ్‌చేసుకుంటాం...." అన్నా డాయన.

"ఆ.... అలాగే నీ పేరేమిటమ్మా...." ఆ అమ్మాయి వంక తిరిగి నవ్వుతూ ప్రశ్నించింది సరోజిని. ఆ అమ్మాయి వచ్చిందగ్గరనుంచి చాలా అనీజీగా కూర్చుంది. పాలిపోయినట్లున్న మొహంలో ఏదో బెదురు ఆదుర్దా కాక ఇంకా ఏవేవో భావాలు ఆమె మొహంలో మెదలడం డాక్టరు దృష్టిని దాటిపోలేదు. తప్పుపని చేసిన పసిపిల్ల తల్లి దృష్టినుంచి తప్పించుకొన్నట్లుగా ఆమెచూపులు బెదురుతూ ఇటూ అటూ చూస్తున్నాయి. డాక్టరు ప్రశ్నకి ఆ అమ్మాయి బదులు తల్లి జవాబిచ్చింది. అమ్మాయి పేరు "మాధవి" అంది.

"అమ్మాయికి మొదటి కాన్పేనా ! అల్లుడుగా రేంచేస్తున్నారు ?"

ఆయన, ఆవిడ చప్పున మొహాలు చూసుకున్నారు. జవాబు చెప్పడానికి గుటకలు మింగా రిద్దరూ. అలాంటి ప్రశ్నలు అడగడం అలవాటుతప్ప వాళ్ళ జవాబులు వినే ఓపిక, ఇంటరెస్ట్‌లేని సరోజినీదేవి వాళ్ళు జవాబు ఈయడానికి గుటకలు మింగడంచూడలేదు.

"ఆ.... మొదటికాన్పే." అన్నా డాయన కాస్సేపటికి. అప్పటికే కుర్చీలోంచి లేచి "నర్సు అమ్మాయిని గదిలోకి తీసికెళ్ళు" అంది డాక్టరు.

అమ్మాయిని పరీక్షించడం అయ్యాక.... "అమ్మాయి చాలా బలహీనంగావుంది. మందులు టానిక్కులు అవి ఏం యిప్పించడంలేదా !" అంది అలవాటయిన ఆదుర్దాని గొంతులో చొప్పించి. డాక్టరుకి అలా అనడం అలవాటు. మామూలు అని తెలియని తల్లి దండ్రులు ఆందోళనగా మొహాలు చూసుకున్నారు.

"మరేం భయంలేదు కదా. అంతా సరిగా వుందాండి తల్లి" ఆదుర్దా పడింది.

"భయానికి ఏం లేదనుకోండి. అయినా మీరు కొస్త ముందుగా తీసుకురావల్సింది. సరే యిప్పుడింక నా దగ్గరికి తీసుకొచ్చారు గనక ఇంక భయం లేదనుకోండి. నేను చూసుకుంటాను లెండి. అసలిదివరకు ఏ డాక్టరికీ చూపించలేదా ?.... ఏం అమ్మా మీ ఆయన నీకేం మందు లిప్పించలేదా ? టూ బాడ్, రానీ పాపని చూడడానికి వచ్చినప్పుడు నేనే అడుగుతానుండు. అని నవ్వుతూ 'డోంట్ వర్రీ, యూ విల్ బి సేఫ్ యిన్ మై హాండ్స్" అంటూ బుజం తట్టింది. "సరే మందులు ఇంజక్షన్సు రాసిస్తాను. ఈ నెలయినా యిప్పిస్తే కొస్త కోలుకుంటుంది అమ్మాయి.... ఇంకా యిఃపై రోజుల పైన పైముందిలేండి...." అంది డాక్టరు.

"ఇంజక్షన్సు మీరే యిస్తారా అండీ ?"

"మీ యిష్టం, ఎవరిచ్చినా ఈయవచ్చు అనుకోండి. కాని ఎప్పటికప్పుడు ఏ మాత్రం ఇంప్రూవ్‌మెంటు వుందో నేను చూస్తూండడం అవసరం...." అంటూ ఆపేసింది. ఆ మాట అన్నాక అవతలివాళ్ళు ఆవిడ దగ్గిరకే తీసుకురాక మానరని ఆవిడకి తెల్సు. ఒక్కొక్క ఇంజక్షనుకు పది రూపాయలు బిల్లు వేయవచ్చు అన్న విషయం ఆమె కెవరూ చెప్పనక్కరలేదు.

"సరే. అయితే వస్తాం.... మీ బిల్లు—" అన్నాడా పెద్దమనిషి.

"బయటగదిలో నర్సు వుంటుంది. అక్కడ ఈయండి." నిర్లక్ష్యంగా అంది డాక్టరు. అదో పెద్ద విషయం కానట్లు, బిల్లుకి అంత ప్రాముఖ్యం లేనట్లు. కాని పై గదిలో నర్సు పేషెంట్లు వెళ్ళడానికి ముందే రెడీగా నిల్చుని డాక్టరుగారి విజిటింగు ఫీజు పాతిక రూపాయలు అక్కడ పెట్టందే, ఎంత తెల్సినవాళ్ళనీ వెళ్ళనీయదని, మళ్ళీ మర్నాడు వచ్చే పేషెంట్లుకూడా రేపటి సంగతి రేపు, ఈరోజుది ఈరోజు అంటుందని పాపం ఆ పెద్దమనిషికి తెలియక డాక్టరు మంచిని, మాట మంచిని, ఆమె శ్రద్ధా సక్తులని మన

స్ఫూర్తిగా మనసులోనే మెచ్చుకుంటూ అతి శ్రద్ధగా, కృతజ్ఞతతో నమస్కారంపెట్టి శెలవు తీసుకున్నాడు.

*  *  *

సరోజనీ మెటర్నిటీ హోమ్‌కి ఆ నగరంలో మంచి పేరు ప్రతిష్ఠలే వున్నాయి. డాక్టరు సరోజనీ గైనికాలజీ స్పెషలిస్టు అవడం ఒక కారణం. ఆ చుట్టు ప్రక్కల ఆ మాత్రం సదుపాయాలున్న నర్సింగు హోమ్ మరోటి లేకపోవడంతో సరోజిని ఖరీదు— అందుబాటులో లేకపోయినా అంతో ఇంతో వున్నవాళ్ళందరూ ఆమె దగ్గిరికే వెడుతుంటారు. వెళ్ళక తప్పదు అని అనాలేమో, ఏమాట కామాటే చెప్పుకోవాలి.... ఆవిడ విజిటింగు ఫీజు పాతిక రూపాయలు, ఆవిడ నర్సింగు హోమ్‌లో రూముకి రోజుకి ఇరవై రూపాయలు. నార్మల్ డెలివరీ అయినా రెండొందల బిల్లు. కాస్త కాంప్లికేటెడ్ పురుళ్ళకి మూడొందలు నాలుగువందలు పుచ్చుకుంటే ఏంగాక, ఆవిడ నర్సింగు హోమ్ మంచి నీటుగానూ దాన్లో పేషంట్లకి మంచి ఎటెన్‌షన్, డే డ్యూటీకి ఇద్దరు నర్సులు, నైట్ డ్యూటీకి ఇద్దరు నర్సులు అంతా మంచి సిస్టమేటిక్‌గా జరుగుతుం దంటారు అందరూ.

డాక్టరు సరోజనీలాగే ఆవిడ నర్సింగు హోమూ అందంగా ఆధునికంగా వుంటుంది. ఆవిడలాగే నున్నగా ఆవిడ నర్సింగుహోమ్ ఫ్లోరింగు మెరుస్తూంటుంది. ఆవిడ కట్టే అందమైన ఖరీదయిన చీరల్లాగే నర్సింగు హోమ్‌లో అందమైన, ఖరీదయిన పరదాలుంటాయి. ఆవిడ మంచి ఖరీదయిన ఉడుకులాం వాసనవేస్తే ఆవిడ నర్సింగు హోము లాసాల్ వాసన వేస్తుంటుంది. రోజూ ఆవిడ విరిసీ విరియని గులాబీ తలలో పెట్టుకోవడమే గాక గులాబీలను పేషెంట్ల గదుల్లో ఫ్లవర్‌వాజుల్లో పెట్టిస్తుంది. మొత్తానికి డబ్బు మాట ఎలా వున్నా నర్సింగు హోములో హాయిగా వుంటుందని అనుకోకుండా వుండలేరు ఎవరూ. డబ్బు గుంజితే గుంజిందికాని మంచి శ్రద్ధ చూపిస్తుంది. హస్తవాసీ మంచిదే అనుకుంటారు పేషెంట్లు వెళ్ళే టప్పుడు.

ఆవిడ మనిషెంత అందంగా నాజూగ్గా వుంటుందో ఆవిడ మనసంత వికారంగా కఠినంగా వుంటుందంటారు తెలిసినవాళ్ళు. జీవితంలో ఆవిడకి డబ్బు సంపాదించడమే ధ్యేయం. ఆవిడ మనీకి తప్ప, మైండుకి ఏ విలువా యీయదని, ఆవిడ మైండు, హార్టు వగైరాలన్నీ మనీ క్రింద కప్పబడి వుంటాయని, ఆ మనీ సంపాదించడంకోసం పాపానికీ పుణ్యానికి వెరవదనీ ఆ మనీకోసం జిత్తులు, ఎత్తులు ఎన్నైనా వేస్తుందనీ అనుకుంటారు ఆవిడని తెల్సినవాళ్ళు.

కాన్పుకి పేషంటుని టేబిల్ మీదకి ఎక్కించిం దగ్గరనించి తెగ గాభరాపడిపోతుంది. నాలుగు గట్టినొప్పులు పడనీయదు. "అయ్యో అయ్యో పిల్ల అలిసిపోతుంది. అంత అలసిపోకూడదు. 'అయ్యో పాపం అమ్మాయి ఓర్చుకోలేక పోతుంది.' అంటూ స్వంత కూతురు నొప్పులు పడ్తోంటే చూడలేని తల్లి లా గిలగిల లాడ్తుంది. "లాభంలేదు. అమ్మాయి ఇంక కష్టపడలేదు. ఫోర్ సెప్స్ వేసి తీసేస్తాను." అంటూ హడావిడిపడ్తుంది. అలా గాభరాపడే డాక్టరుని చూసి నెప్పులు పడే ఆడవాళ్ళ వాళ్ళ భర్తలు, తల్లులు తండ్రులు నిజంగా ఈ డాక్టరు ఎంత మంచిది, ఎంత జాలి గుండె, పేషెంటుని ఎంత జాగ్రత్తగా చూస్తుంది. ఇంత శ్రద్ధ ఇంకో డాక్టరెవరూ చూపించరు అనుకుంటూ ఆవిడపట్ల కృతజ్ఞతతో వాళ్ళ మనసులు నిండిపోతాయి తప్ప డాక్టరుగారి ఆ గాభరా, ఆ ఆదుర్దా ఆవిడకి ప్రతీకాన్పుకీ అలవాటయిన వ్యవహారం అని అలా అలా ఎన్నో కాన్పులకి అలవాటయిన ఆ నటన యిప్పుడు ఆవిడకి మామూలు అయిపోయిందని, నటించక్కరలేకుండానే నోట్లోంచి ఆ మాటలు వస్తాయని వాళ్ళు గ్రహించలేరు. ఆవిడ మొహంలో హావభావాలు ఆమెకి తెలికుండానే మారిపోతూంటాయని చస్తే వూహించలేరు. ఆ ఆదుర్దా అంతా ఫోర్ సెప్స్ వేస్తే మరో వంద బిల్లు ఎక్కువ చేయవచ్చని. నొప్పులు మామూలు నొప్పులే అయినా ఏదో బిడ్డ బయటకి రాదన్నంత హడావిడి తను పడి, పేషెంట్ల తాలూకువాళ్ళని పెట్టి ఆ కాంప్లికేటెడ్ కేసుని తనుగాబట్టి గట్టెక్కించినట్టు, అందు మూలంగా ఆమె పడిన కష్టానికి మరికాస్త బిల్లు వడ్డించవచ్చని ఆవిడ అనుకుంటుందన్న విషయం వాళ్ళ వూహకి ఎలా అందుతుంది?

కాన్పులకేకాదు. మామూలు ఏ గర్భిణీ స్త్రీయో పరీక్ష చేయించుకోడానికి వచ్చినా పరీక్షిస్తూ ఆదుర్తాగా "బిడ్డ సరిగ్గా తిరుగుతూందా" అనో "నొప్పి ఏమన్నాగాని వస్తుందా" అంటూ అడుగుతుంది. దాంతో టేబిల్ మీద పేషంటు గాభరాపడ్తూ "ఏం డాక్టర్, అలా అడుగుతున్నారు" అంటూ కలవరపడ్తారు. ఆవిడ కాస్త ఆలోచన నటించి మరోసారి పరీక్షిస్తుంది సీరియస్‌గా మాట్లాడకుండా ! పేషెంటు మరింత గాభరాపడుతుంది. "కాస్త గట్టిగా నొప్పి వస్తే పుడు వచ్చేట్టుంది" అంటుంది. దాంతో ఏ ఏడో నెలో వున్న ఆ పేషెంటు "అయ్యో ! అదేమిటండి, ఎలాగండీ, అంటూ భయంగా చూస్తుంది. అప్పుడు డాక్టరు దీర్ఘంగా ఆలోచిస్తూ, చేతులు కడుక్కుంటుంది. తాపీగా పేషెంటుని మరిచిపోయి అవతల పేషెంటు డాక్టరు నోట్లోంచి రాబోయే మాట కోసం ప్రాణా లుగ్గపట్టుకుని ఎదురు చూస్తూంటుంది. డాక్టరింకా ఆలోచిస్తూనే కాగితం తీసి రాస్తుంది. "చూద్దాం. మరేం పర్వాలేదులే... ఇంజక్షన్సు యిస్తాను.... అంతా నేను సరిచేస్తాగా! కంగారు పడకు. ఇంట్లో అట్టే తిరక్కు. భయపడకు నేనున్నానుగా" అంటూ ధైర్యం చెపుతుంది. పేషెంటుకి పోయిన ప్రాణం తిరిగి వస్తుంది. ఏదో క్రిందపడి పోవడానికి సిద్ధంగా వున్న నెల తక్కువ బిడ్డని క్రిందపడకుండా నెలలు నిండేవరకూ నిలిపి వుంచింది. ఈ డాక్టరు గాబట్టి అనిపించి వాళ్ళు ఆవిడపట్ల కృతజ్ఞతతో, గౌరవంతో ఉక్కిరిబిక్కిరి అయి ఆవిడ బిల్లు ఎంత వేసిందోకూడా పట్టించుకోకుండా ఇచ్చేస్తారు తప్ప డబ్బెక్కువ లాగడానికి అలా అందని వాళ్ళు ఊహించలేదు. అలాగే ప్రతి కేసుని, సింపుల్ కేసుని, కాంప్లికేటెడ్ చేసేసి ఎక్కువ డబ్బు లాగుతుందనీ పాపం చాలామంది గ్రహించలేరు. జనరల్ ఆస్పత్రిలో మూడు నిమిషాలలో అయ్యే 'కార్టరైజేషన్' లాంటి సింపుల్ వాటికికూడా ఓ అరగంట చేసి మూడొందలు గుంజుతున్న విషయమూ గ్రహించలేరు. జనరల్ ఆస్పత్రికి వెళ్ళే పేషెంట్లని అక్కడి డాక్టర్లు సరోజినీదేవితో లాలూచీలు వుండే డాక్టర్లు కాస్తో కూస్తో డబ్బుకొని "పేషంట్లనిఫలానా నర్సింగుహోమ్ అయితే మీకు చాలా సదుపాయంగా వుంటుంది. మంచి ఎటెన్షన్ వుంటుంది. ఆ డాక్టరు చాలా మంచిది" అంటూ సరోజినీ నర్సింగుహోము వైపు డైవర్టు

చేయడానికి ప్రయత్నిస్తారు. జనరల్ ఆస్పత్రి చుట్టూ తిరిగే ఓపికలేని డబ్బున్న వాళ్ళు, పొరుగూరినుంచి వచ్చే ధనవంతులు, పని త్వరగా ముగించుకోవాలని ఆరాటపడేవాళ్ళు, జనరల్ ఆస్పత్రిలో చెడిపోయిన ఎక్విప్మెంటు ఎప్పుడు బాగవుతుందో, అసలు బాగవుతుందో లేదో (అసలు చెడిపోయిందో లేదో) తెలియనివాళ్ళు అందరూ సరోజినీదేవి నర్సింగ్ హోమ్‌కి వెళ్ళి జనరల్ ఆస్పత్రిలో ఏ పాతిక రూపాయలతో అయ్యేదానికి రెండొందలు సమర్పించుకున్నామన్న సంగతి గుర్తించుకోకుండా "పని త్వరగా ముగిసింది, నర్సింగ్ హోము చాలా బాగుంది అనుకుంటారు తప్ప, ఇలాంటి కేసులకి వచ్చేడబ్బు ఆ డాక్టరు ఈ డాక్టరు చెరి సగం పంచుకుంటారన్న సంగతి గ్రహించలేరు। ఎవరన్నా గ్రహించినా మరో గత్యంతరంలేక మనసులో తిట్టుకుంటూనే వాళ్ళవసరం కోసం అక్కడికి వెళ్ళకా తప్పదు. వెళ్ళి ఆవిడ కోరినంత సమర్పించుకొనక తప్పదు!

మహాఅయితే "మాయదారికాలం. మాయదారి డాక్టర్లు యిలా జలగల్లా పీల్చేస్తున్నారు. యిలా గుంజేస్తున్నారు. డాక్టర్ల పని బాగుంది" అంటూ తిట్టుకుంటారు కాసేపు.

అంచేత డాక్టరు సరోజినీదేవి మనకోసం ఎన్నిజిత్తులు ఎత్తులు వేసినా అవి జిత్తులు ఎత్తులు అని తెల్సినవారు తెలియనివారూ ఆ వూర్లో ఆవిడ నర్సింగ్‌హోమ్‌కి వెళ్ళకమానరు! వెళ్ళక తప్పదు.

అలా సంపాదించిన మనీతో ఆవిడ ఊర్లో దివ్యమయిన బంగళా కట్టించింది! అంతకంటె దివ్యమైన నర్సింగు హోము కట్టించింది. కారు కొంది. కంపెనీలో షేర్లుతీసుకుంది. బ్యాంకిల్లో ఏకౌంట్లు ఓపెన్‌చేసింది. సోఫాసెట్లు, రేడియో గ్రాములు, ఫ్రిజిడేర్లు, డన్‌లప్పులు, ఎయిర్‌కూలర్లు వగైరా యింటికి కావాల్సిన హంగులన్ని అమర్చుకుంది. వంటకి అయ్యరు, పిల్లలకి ఆయా, కారుకిడ్రైవరు మొదలైన పరివారాన్ని ఏర్పరచుకుంది. ముగ్గురు పిల్లలు ముచ్చటగా కాన్వెంటులో చదువుతున్నారు: ముగ్గురుకి మూడు ఇన్సూరెన్సు పాలసీ లున్నాయి!

2)

ఆవిడభర్త ఆనందరావు సార్థకనామధేయుడు! ప్రపంచంలో తను పొందగలిగినంత ఆనందాన్ని, సరోజినీదేవి డబ్బుతో పొందుతూ ఆనందిస్తుంటాడు. అతను నలుగురికీ మిస్టర్ సరోజినీదేవిగానే తెలుసు. అతనికీ ఓ బ్యాంకి ఎకౌంటు ఇన్సూరెన్సుపాలసీ తీసుకుంది సరోజినీదేవి! ఆతని పెత్రివేటు తిరుగుడికి 'ఓ వెస్పా' కొనిచ్చింది. ఆమె పురుళ్ళు గర్భస్రావాలు చేసి సంపాదించిన డబ్బుని పేకాటద్వారా చేతనయినంతగా ఖర్చుచేయడం అతని హాబీ. భర్త అన్నపదానికి నిజమైన అర్ధంచెప్పాలంటే వారి సంసార జీవితంలో సరోజినీదేవే భర్త! ఆనందరావు విశ్వాసపాత్రుడైన భార్య!

ఇంక డబ్బు కాపీనం ఆవిడకెందుకు ? నెలకి ఎంతలేదన్నా ఐదారు వేల పైన సంపాదిస్తుంది. ఇంకా ఇంకా యిలా ఈ డబ్బుకోసం ఆవిడ కీ కక్కుర్తి ఎందుకు చెప్మా అని, ఆవిడంటే గిట్టనివాళ్ళు కసిగా అనుకుంటారు. ఖర్చుపెట్టే మొగుడున్నాడు. ముగ్గురు పిల్లలున్నారు. నల్గురు నర్సులున్నారు. నర్సింగ్ హోమ్ వుంది. నలుగురు నౌకర్లున్నారు. ఇన్‌కంటాక్సు వాళ్ళున్నారు. స్టేటస్ ఉంది. ఇవన్నీ మెయిన్ టెయిన్ చెయ్యాలంటే డబ్బు వద్దా ఏమిటి, పాపం ఆడది సంసారం లాగుకొస్తూంది" అంటారు ఆవిడ అభిమానులు.

మొత్తానికి ఆవిడ డబ్బుమనిషని పేరుపడింది ఆ వూర్లో! అయినా ఆవిడ నర్సింగ్ హోమంత బిజీ నర్సింగ్‌హోమ్ ఆవూళ్ళో లేదు.

* * *

సరోజినీదేవి నర్సింగు హోము వరండాలో పొద్దుటనుంచి అతి ఆదుర్దాగా వినబోయే కబురుకోసం ఆందోళనపడుతూ డ్రైవరు రంగయ్య కూర్చునాడు.

లోపల వెయిటింగు రూములో మాధవి తల్లిదండ్రులు అంతకంటె ఆందోళనగా ఎదురుచూస్తున్నారు కబురుకోసం.

లోపల డాక్టరు సరోజిని అంతకంటె గాభరాగా వుంది. రెండు డెలివరీకేసులు. అందులో ఒకటి డబ్బొచ్చే కేసు! రెండోది ఉల్ఫాకేసు!

రంగయ్య భార్య సీతాలుకీ, మాధవికి మధ్య స్క్రీన్ మాత్రం అడ్డువుంది. అటు సీతాలు యిటు మాధవి ఇద్దరు నొప్పులు పడుతున్నారు. ఇద్దరూ స్త్రీలే. ఇద్దరి బాధ ఒకటే.

ఈ లోకంలో డబ్బుకెంత విలువుందో తెలియని మనుషుల్ని ఒక్క క్షణం అక్కడికి తీసుకొచ్చి నిల్చోపెడితేనే చాలు. డబ్బు విలువ ఎంతటిదో ఎవరూ నోరు విప్పి చెప్పక్కర లేకుండానే క్షణంలో గ్రహిస్తారు. నైతిక విలువల్ని కూడా డబ్బు ఎలా తారుమారు చేస్తుందో తెలుసుకోడానికి నిరంతర సృష్టి జరిగే ఆ గదే ఆటపట్టు.

డాక్టరు సరోజిని స్వయంగా మాధవి ప్రక్కన కూర్చుని కాలు రాస్తూంది. కడుపు రాస్తూంది. చెమటలు పట్టిన ఆమె మొహంమీద అతుక్కుపోయిన వెంట్రుకలని ఆప్యాయంగా సవరిస్తూంది. కాస్త ఓర్చుకోవాలమ్మా ....అయిపోయింది కాస్త గట్టి నొప్పులు వస్తే కాన్పు అయిపోతుంది. కాస్త వేడి వేడి కాఫీ త్రాగుతావా.... ఇదిగో డైల్యూషన్ పూర్తికాగానే ఇంజక్షనిచ్చేస్తాను నిమిషంలో పురుడు వస్తుంది. కాస్త ఓపికపట్టు అంతగా అయితే ఫోర్సెప్స్ వేస్తాను....నీకు భయంలేదు. అలా కాళ్ళు చాచుకో.... బాగా బాధగా వుందా...." అంటూ ఉపశమనాలు పల్కుతూంది బయట కూర్చున్న ఆమె తల్లిదండ్రులకి "మరేం ఫరవాలేదు, భయం లేదు. నేనున్నాగా" అంటూ ధైర్యం చెప్పి వస్తూంది.

ఆ స్క్రీన్ అవతల - సీతాలుని ఎటెండ్ అవుతున్న నర్సు సీతాలు ఖర్మానికి సీతాలుని వదిలి ఓ పుస్తకం చదువుకుంటూంది. మధ్య మధ్య సీతాలు గట్టిగా మూలిగి, అరిచినప్పుడల్లా "అబ్బ అబ్బ ఏమిటలా అరుస్తావు. కాస్త ఓర్చుకోలేవూ చిన్నపిల్లలా ఏమిటా కేకలు, ఇప్పుడప్పుడే ఏం పురుడు రాదులే" అని కసురుతూంది. "ఇదిగో అలా ఊపిరి పైకిలాగుతావేం. క్రిందికి వదులు, మూడు కాన్పులయ్యాయి. ఇంకా తెలియదా" అని

మరోసారి కేకలు వేస్తూంది. "అబ్బబ్బ అలా గొడవ చెయ్యకు. ఇది ఆస్పత్రి అనుకున్నావా ? నీ యిల్లనుకున్నావా ? ఏం మొగుడి దగ్గర పడు కున్నప్పుడు తెలీదా ఏమిటి ? కడుపొస్తుందని, నొప్పులు పడాలని...." అంటూ విదిలించి పారేస్తూంది. పాపం సీతాలు గట్టిగా మూలగడానికి కూడా భయపడ్తూంది. అవతల రంగయ్య ఏ నర్సునైనా కనిపిస్తే ఆరాటంగా భార్యకి ఎలా వుందోనని అడిగితే జవాబు చెప్పి నపుడు చెప్తున్నారు. లేనపుడు విసుగ్గా ముఖం చిట్లించి వెళ్ళిపోతున్నారు. డాక్టరయితే "ఇదిగో అలా పదిసార్లు అడక్కు. కాన్పు అంటే నిమిషాలలో అయిపోతుం దను కుంటున్నా వేమిటి" అని గదమాయించింది.

అసలే డాక్టరుకి చాలా విసుగ్గా చిరాగ్గా, కోపంగా వుంది రంగయ్య మీద. ఇలాంటి ఫ్రీకేసులు ఎటెండు అవడం ఎంతమాత్రం ఇష్టంలేదు ఆవిడకి. ఏదో మాటవరసకి అన్నమాట పట్టుకుని రంగయ్య తన పెళ్లాన్ని తన నర్సింగుహోముకు తీసుకురావడం ఆవేళకి రెండు రూములు ఖాళీ వుండి సరేననక తప్పకపోవడం, తీరా చేసి సీతాలు వచ్చిన ఓ గంటకే మాధవిని తీసుకురావడం, అలాంటి డబ్బు వచ్చేకేసు పక్కన సీతాలులాంటి కేసుమీద ఎటెండవడం ఆవిడకి ఇష్టం లేదు. కాని టేబిల్ ఎక్కించాక తప్పదు. పొమ్మనలేక రంగయ్యమీద విరుచుకు పడింది ఆవిడ.

చెబితే విన్నావుకాదు, ఇలా ప్రాణం తీస్తే ఎలా అంది. నీ నించి నా పరువు పోతూంది అంటూ తిట్టింది. కసిరింది, విదిలించింది, విసు క్కుంది.... ఏం చేసినా ఈ సమయంలో బయటికి తీసుకు పొమ్మనదులే అనే భరోసాతో డాక్టరమ్మగారి విసుగు, కోపం అంతా భరిస్తూ కిక్కురు మనలేదు రంగయ్య.

సీతాలుకు నొప్పులు ఎక్కువయ్యాయి. అవతల మాధవికి నొప్పులు ఎక్కువయ్యాయి ! డాక్టరు కంగారు చెప్ప నలివికాదు. నర్సు ఏం కంగారు లేకుండా సీతాలు పక్కన నిల్చుంది. మాధవి నొప్పులు భరించలేకపోతూంది. సీతాలు అంతకంటే ఎక్కువ నొప్పులు వస్తున్నా నోరుమూసుకు భరి

స్తూంది. ఇంక ఓర్చుకోలేదు. ఫోర్‌సెప్స్ వేసేస్తాను. అనుకుంటూంది డాక్టరు ! ఫోర్‌సెప్స్ వేయడం ఆ దండుగకూడా ఎందుకు ఫ్రీ కేసుమీద. వచ్చినట్టు కాసేపు నొప్పులు పడితే అదేవస్తుంది పురుడు అనుకుంటూంది సీతాలు పక్కన నర్సు.

సీతాలుకి మగపిల్లాడు పుట్టాడు, కేరు కేరు మన్నాడు.

అవతల మాధవికి ఫోర్‌సెప్స్ వేసి బిడ్డని బయటికి లాగింది డాక్టరు. బిడ్డ కే రు మ న లే దు ! .... చన్నీళ్ళు కొట్టింది వేణ్ణీళ్ళు తప తప మోదింది. తలక్రిందులు చేసింది బిడ్డని. నోట్లో నోరుపెట్టి వూదింది. ఏం చేసినా బిడ్డ కదలలేదు. డాక్టరు గాభరాగా నర్సువంక చూసింది. ఆవిడ కళ్ళ ముందు పచ్చనోట్లు కదిలాయి..... నర్సు డాక్టరు వంక, డాక్టరు నర్సువంక చూసుకున్నారు. అవతల సీతాలు కొడుకు కేరు మంటూ నర్సింగుహోము పైకప్పు ఎగరగొడ్తున్నాడు ! సీతాలు సొమ్మ సిల్లి పడివుంది కళ్ళు మూసుకుని. డాక్టరు ఓక్షణం నుదురు చిట్లించింది. మెదడులో ఆలోచనలు పరుగులుదీశాయి. క్షణంలో ఆవిడ మొహం తిరిగి కళకళ లాడింది. అవిడ కళ్ళు మిల మిల లాడాయి. నర్సువంక చూసింది. ఆ నర్సుకి డాక్టరుగారి భాష, భావం కళ్ళ భాష ద్వారానే తెలుసుకోవడం అలవాటు కనక ఆవిడ భావం అర్థం అయిపోయింది. తలపంకించింది. పనికి ఉద్యుక్తురాలైంది.

ఫలితం— ఇప్పుడు మాధవి ప్రక్కన బిడ్డ కేరు కేరుమని ఏడవడం ఆరంభించాడు. సీతాలు ప్రక్కన నిల్చున్న నర్సు చాలా కంగారు నటిస్తూ హఠాత్తుగా ఏడుపుమానేసిన సీతాలు కొడుకుని ఏడ్పించే ప్రయత్నాలు అన్నీ చేస్తూంది. నర్సువల్ల ఆ ప్రయత్నం సాగక డాక్టరు స్వయంగా సీతాలు కొడుకుని ఏడ్పించడానికి ప్రయత్నాలు చేస్తూంది. హఠాత్తుగా ఆగిపోయిన కొడుకు ఏడుపు, డాక్టర్లు నర్సుల హడా విడి ఏమిటో అర్థంకాక సీతాలు

కళ్ళు విప్పి అయోమయంగా చూసింది. ఐదు నిమిషాలు అన్ని ప్రయత్నాలు ప్చ్ లాభంలేదు. బిడ్డ పుట్టినప్పుడు బాగానే పుట్టాడు యింతలో ఇలా అవుతుం దనుకోలేదు. ఎంత కావాలి చంటి గ్రుడ్డు ప్రాణానికి" అంటూ విచారంగా సీతాలువంక చూసింది. జరిగింది ఏమిటో అర్థంగాక కాసేపు వెర్రిదానిలా చూసి, అర్థం అయ్యాక భోరుమంది సీతాలు. అవతల కబురు తెలిసిన రంగయ్య గుండె బద్దలయింది. "నీ అదృష్టం ఈసారి బాగులేదు రంగయ్యా, నేనేం చెయ్యగలను చెప్పు నా చేతికో ఏముంది ! నా చేతనయినంత చేశాను." అంటూ సానుభూతి పలికింది సరోజిని.

ఆ తర్వాత— క్షణం సంతోషపు ముసుగు తగిలించుకుని వసారాకి యిటు నడిచింది— మాధవి తల్లిదండ్రులున్న చోటికి.

"కంగ్రాచ్యులేషన్స్ మీకు మనుమడు పుట్టాడు. తల్లీ బిడ్డా క్షేమంగా వున్నారు." అంది.

ఆ మొఖాలు వికసించలేదు. ఆనందంతో తన చేతులు పట్టుకుని కృతజ్ఞతలు చెప్పుకోలేదు. మొదటి సారి మనవడు పుట్టినందుకు సంతోషంతో ఉక్కిరి బిక్కిరి కాలేదు. ఆ వార్త విని ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నారు. డబ్బు తప్ప మరేమీ కంటికి ఆనని సరోజిని దృష్టికి ఆ రోజు మాధవి తల్లిదండ్రుల మొహాలు వింతగా కన్పించాయి. ఆనందం స్థానే ఆందోళన, గర్వం స్థానే గాభరా వాళ్ళ మొహాల్లో కన్పడటం వింతగా చూసింది సరోజిని.

ఆయన కాస్త గాభరాగా, హడావిడిగా డాక్టరుని చూసి డాక్టరుగారూ మీతో చిన్న విషయం మాట్లాడాలి అన్నాడు గొంతు తగ్గించి. సరోజిని కాస్త ఆశ్చర్యపోతూనే "చెప్పండి" అంది.

"అహా .... ఇక్కడకాదు. అలారండి" అంటూ ఆవిడగదిలోకి దారి తీశాడు. అక్కడ ఆయన గుటకలు మింగుతూ, నీళ్ళు నములుతూ, గాభరా

వడుతూ వణుకుతున్న గొంతుతో ఆయన చెప్పిన మాటలు విన్న సరోజినీ దేవి నిశ్చేష్టురాలయింది. ఆమె నోట మాట రానంతగా దిమ్మెరపోయింది కొన్ని క్షణాలు. ఆ కొన్ని క్షణాలు గడిచాక ఆవిడ మొహంలోకి రక్తం ఒకసారిగా పొంగింది. ఆ క్షణంలో ఆవిడ మనోభావాన్ని చెప్పగలిగే మాటలేదు.

ఆఖరికి నోట్లోనుంచి మాటలు పెగల్చుకుని. తీక్షణంగా చూస్తూ "ఈ సంగతి ముందుగా నాతో ఎందుకు చెప్పలేదు....." అనిమాత్రం అన గలిగింది.

ఆయన చేతులు నలుపుకుంటూ "ఎలా చెప్పడం....ఏమని చెప్పడం ఎలా చెప్పగలం ? సరే, కాన్పు అయ్యాక చెప్పచ్చు అనుకున్నాం..... ఈ సంగతి మరో మనిషికి తెలియకుండా వుంచడం మీ చేతుల్లో వుంది. డాక్టర్! మా పరువు ప్రతిష్టలు మీ చేతుల్లో వున్నాయి. ఆ పరువు కాపాడు కోటంకోసమే అమ్మాయిని తీసుకుని ఇక్కడికి ఈ కొత్తవూరు వచ్చి ఈ వూరుకాని ఊరులో హోటల్లో రెండు నెలలనుంచీ అమ్మాయిని పెట్టుకుని వున్నాం. అమ్మాయి ఇలాంటి వెధవపని చేసిందని ముందుగా మాకు ఏ మాత్రం తెల్సినా ఏదో చేసేవారం! ఐదు నెలలు నిండేవరకు మేమూ కని పెట్టలేదు. అమ్మాయీ చెప్పలేదు. అప్పుడింక ఏం చెయ్యలేక, ఏడో నెల రాగానే ఆ ఊరునించి యిక్కడకొచ్చి మకాం పెట్టాం. ఈ కాన్పు అయితే ఆ పిల్లాడిని ఏ అనాథ శరణాలయంలోనో ఇచ్చేసి అమ్మాయిని తీసికెళ్ళి పోవాలని మా వుద్దేశ్యం. డాక్టర్! అమ్మాయికి యింకా తెలివి రాలేదుగదా! అమ్మాయికి తెలివి రాగానే పిల్లాడు పుట్టి పోయాడని చెప్పండి. నేనా పిల్లా డిని తీసికెడతాను. ఈ సంగతి దానికి తెలిస్తే అది భవిష్యత్తులో నిశ్చింతగా వుండలేదు. డాక్టర్ ఈ విషయం అమ్మాయికి చెప్పొద్దు..... డాక్టర్, ఈ

రహస్యం దాచినందుకు మీకు తృప్తి కలిగిస్తాను. ...డాక్టర్, పిల్లాడిని తెప్పిస్తారా, దానికి తెలివి వచ్చేలోగానే వదిలించుకుని వస్తాను." ఆయన హడావిడిగా డాక్టర్ మొహంలో మారుతున్న రంగులని చూడకుండానే చెప్పాడు.

డాక్టర్‌కి ఆ మాటలు తలకెక్కడంలేదు. ఆవిడ కాక్షణాన్న హృదయ విదారకంగా ఏడుస్తున్న సీతాలు, పెళ్ళాం గుండెల్లో మొహం దాచుకుని అడదానిలా ఏడుస్తున్న రంగయ్య, మాధవి ప్రక్కన ఉయ్యాలలోని పసికందు మాత్రం కనిపిస్తున్నారు. ఆవిడ- డాక్టర్ సరోజిని కోపాన్ని ఎంతో నేర్పుతో పైకి కన్పించకుండా వుంచుకోవడం ఎంతో ప్రాక్టీసువున్న ఆమె అప్పుడు కోపాన్ని కంట్రోలు చేసుకోలేకపోయింది. "ఈ సంగతి ముందుగా నాకెందుకు చెప్పలేదు." అన్న ప్రశ్నే మరోసారి కోపంతో, తీక్షణంగా అడిగింది.

ఆ సంగతి ముందు చెప్పకపోవడంవల్ల ఆ డాక్టర్‌కి ఏం నష్టమో ఆ సంగతి ఆవిడకి ముందు ఎందుకు చెప్పాలో.... చెప్పక పోయినందున ఆవిడకి జరిగిన అనర్థం ఏమిటో అన్నట్లు వింతగా- ఎర్రబడిపోయిన డాక్టర్ మొహంలోకి చూశాడు. డాక్టర్‌కి యిందులో యింత కోపం రావల్సింది ఏముందో అంతుబట్టలేదు ఆయనకి.

ఆయన ముందుగా ఆ సంగతి చెప్పనందున జరిగిన అనర్థం తెలుసుకున్న డాక్టర్ సరోజనీదేవి హృదయం ప్రాక్టీసు పెట్టాక మొదటిసారిగా "మనీ" క్రిందనించి నిద్రలేచింది. సీతాలు, రంగయ్యని చూస్తున్న సరోజనీదేవి కళ్ళకి పల్చటి నీటి తెర వచ్చి అడ్డు నిల్చింది.

(1972 దీపావళి కథల పోటీలో ఆంధ్ర జ్యోతివారపత్రిక బహుమతి పొందినది)